



# ఒక రాత్రి

## చందు సుబ్బారావు

**అది శ్రీకృష్ణుని అంతఃపురం. వేయి చంద్రులు కొలువు దీరి కూర్చుని చిత్రశుద్ధితో కాంతి పుంజాలు కురిపిస్తున్న వైనం. అటు తిరిగే సామాన్య పరిచారికలు సైతం దేవకన్యలను 'నీవా - నేనా' అన్నట్లున్నారు. ఎటు నుంచో మనోహరమైన పూల వాసనలు కలగలువుతో వస్తున్నాయి.**

చూడబోతే కళ్లు తిరుగుతున్నాయి. వినబోతే మందమాధుర్య సంగీత ధ్వనులు మత్తెక్కిస్తున్నాయి. తినబోతే ఆ ఆహార పదార్థా లేమిటో... దేని పేరేమిటో తెలియదు. ఏది ఎలా తినాలో కూడా తెలియదు. ఎవరు నవ్వుతారో నన్న భయం. తింటే అరుగుతుందో లేదో నన్న శంక. మూడు రోజులుగా ఇదే వ్యధ. ఒక్క క్షణం ఇది శిక్షేమో ననిపించింది కుచేలునకు.

కృష్ణుడు ఒక్క నిముషం వదలటం లేదు. హంస తూలికాతల్పంపై కూర్చోబెట్టుకుని కబుర్లు చెప్పమంటాడు. ఆ తల్పం మీద తనకు కూర్చో బుద్ధేయదు. రుక్మిణీ సత్యభామాది అష్ట సతీమణులతో కృష్ణుడు విలాసం గావించే ఆ తల్పం మీద తా నొక్కసారి కూర్చోవటమే మహా పాపం. పైగా కబుర్లొకటి. ఈ పట్టు వస్త్రాలు ఒంటిని కొరికేస్తున్నాయి. మొన్నటి చిరుగు బట్ట లెక్కడ పారవేశారో? మళ్లీ కట్టుకుంటే గాని ప్రాణం హాయిగా ఉండ దనిపిస్తుంది. ఏమిటో ఈ భ్రాంతి... భయం... ఆందోళన.. ఆనందం... భక్తి... పరవశం మిశ్రమమైన లోకాతీత అనుభవం!

అవును, లోకాతీతమే. దరిద్రు లున్నారు. అష్టయిశ్వర్యాల తులతూగే ప్రభువు లున్నారు. ఎవరి జీవన విధానం వారిది. కాని ఇదేమిటి? పోనీ స్నేహ ధర్మం అయినా ఒక్క పూట అతిథి మర్యాదలు చేసి పంపించివేస్తే ఎంత బావుండేది. ఈ కృష్ణుల వా రేదో పరీక్ష పెడుతున్నారు. లేకపోతే మృదుమధుర మాణిక్య వీణా మూర్ఛనలు వినలేకనా తన మాటల సవ్వడి!

అతి మనోహర చతురాంగనల చిరుదరహాసాలు చూడలేకనా ఈ ముసిలి మొహం ముడతల దర్శనం. భువన సుందరీమణులైన భార్యలతో ముచ్చట్లు చెప్పలేకనా తన చచ్చు పుచ్చు అనుభవాల సంగతులు వినటం! మూడు రోజుల్నుంచి అంతఃపురం స్తంభించిపోయింది. రాచకార్యాలు నిలిచిపోయాయి. కృష్ణుడు కొలువుకు సైతం వెళ్లటం లేదు. తన కిష్టమైన గోపసమూహాన్ని పలకరించటంలేదు. భార్యలు మాత్రం వచ్చిపోతున్నారు. వచ్చిన వాళ్లు ఆయనతో పాటు తనక్కూడా సేవలు. ఎన్ని జన్మల పాపమో ఈ దారిద్ర్యం అనుభవిస్తున్నాను. పైగా ఈ మూర్ద్రోజాల పాపానికి విముక్తి లేని శిక్ష పడుతుంది కామోను! దానికి తన ప్రాణ స్నేహితుడు కారణమవుతాడా? ఏమో... ఏమిటో... పెద్ద వాళ్ల లీల లిలాగే ఉంటాయి కాబోలు! తన భార్యా బిడ్డలకు ఇంకెంత దౌర్భాగ్యం అంటుకుంటుందో?

'పోయి దానం అడుక్కురావయ్యా అంటే, ఆ మహానుభావుని భార్యల చేత సేవలు చేయించుకుంటావా? ఓరి ముసలి పీనుగా... ఉన్న బుర్ర పాడయిపోయిందా? ఈ మాత్రం తిండికి కూడా దూరం చేస్తావా?' అని రేపు వెళ్లగానే భార్య నతాయిస్తుంది కాబోలు!

మర్యాదకు ఏదో కృష్ణుడు ఉండమన్నా తనకు బుద్ధుండొద్దూ? మూర్ద్రోజాలపాటు అంతఃపుర విలాసమా? ఏమిటి తన అర్హత? బాబూ! ఈ రాత్రి ఎలా గడుస్తుందో, తెల్లవారితే ఏదైనా బండి చూసుకుని కృష్ణుని కో నమస్కారం పెట్టి వెళ్లిపోవాలి! ఈ సేవ లేమిటి? ఈ భోగా లేమిటి? ఈ భ్రాంతు లేమిటి? తెలియక ఎంత నేరానికి పాల్పడినట్లు. తలచుకుంటే కుచేలుడి హృదయం గజగజ లాడిపోయింది.

ఈ విషయం మధురానగరం దాటి తెలిసిపోతుంది కాబోలు. దేశ దేశాల

ప్రజలూ చెప్పుకుంటారు కాబోలు. కృష్ణుని భక్తులు తరతరాలుగా తన హి కార్యాన్ని కథలు కథలుగా వివరిస్తారు కాబోలు.. ఎంత పొరపాటు జరిగిపోయింది! ఎంత దారుణం జరిగిపోయింది! కుచేలుడి కళ్ల నుండి ధారలుగా నీళ్లు స్రవిస్తున్నాయి. తుడుచుకోవటానికి పట్టు వం సహకరించదు. ఇదొక పీడ. నేత బట్టయితే నీళ్లని పీలుస్తుంది!

ఇంతలో కృష్ణుని చేతులు రెండూ వెనక నుంచి తన కళ్లను తుడుస్తున్నాయి. "ఏం కుచీ! భార్యా బిడ్డలపై బెంగ వేసిందా? అవును మ ప్రేమామృతం వెదజల్లే భార్యా బిడ్డలను వీడి క్షణమైనా యుగమే కదా! కిక్కడ ఉండబుద్ధేయటం లేదు కదూ?" కృష్ణుడు.

"కృష్ణా! జగన్నేతా! సర్వ ప్రాణికోటి ముక్తి ప్రదాతా!" కుచేలుడు.

"అదుగో. ఈ పాడు మాటలే వద్దంది. ఈ మాటలకూ, స్తోత్రాలకూ నాకు వంధిమాగధులు లేకనా? నిన్ను ఉండమంది! ఇలా మాట్లాడితే రేపు దా ఎందుకు... ఇప్పుడే వెళ్లిపో!"

"లేదు కృష్ణా! చేసిన మహాపరాధం చాలు. నిన్ను బాధపెట్టడం కూడా ఈ పేద హృదయానికి నీ స్నేహ దివ్యామృతం ఎక్కువై కళ్ల నుండీ, కంఠ నుండీ బయట కొస్తుంది. పసివాడికి రస స్పందనార్హత ఉంటుందా? నీవైన గ్రహించవద్దూ?"

"పోన్లే.. ఈ అంతఃపురం వద్దు. అక్కడ గోశాల ఉంది. దాని ముంగి కూర్చుని కబుర్లు చెప్పుకుందాం. నీకూ హాయిగా ఉంటుంది. ఈ వేళ పచ్చ పాలు త్రాగుదాం. ఆహార మింకేమీ వద్దు.. పద!"

కుచేలుడు నగం కోలుకుని బయటకు నడిచాడు. కృష్ణుని చేయి త భుజాలపై చుట్టుకుని ఉంది. అతి మధురమూ, సుగంధ భరితమూ వాత్సల్యపూరితమూ, విశాల ప్రాపంచికానుభవ సంభరితమూ, లీల విలాసితమూ అయిన శ్రీకృష్ణ విగ్రహం ప్రక్కన నడవటం చిన్న నాటి చదువుకునే రోజుల్లోనే ఎంతో ఆనందకరంగా ఉండేది. ఇప్పుడేమిటో భయంకరంగా ఉంది. భుజాలపైన అతని చేయి ఆదిశేషువు నీడలా ఉంది ప్రక్కన చెవిలో వినిపించే అతని హాస్యోక్తులు భువన మోహి గంధర్వగానంలావున్నా ఎందుకో చికాకు వేస్తుంది. హాస్య అలరించటంలేదు. చతురోక్తుల సారస్యం బోధపడటం లేదు. ఇద్దరు నడుస్తున్నా రంతే.

"జయము జయము కృష్ణ దేవా!" మధ్యలో ఒక పరిచారిక!

"ఏమిటీ విశేషం?"

"ఈ వేళ తమ ప్రాణేశ్వరి జాంబవతీ దేవి వారి జన్మదినమని తమకు గుర్తు చేయమన్నారు. ఆమె భవనంలో ఉత్సవ సన్నాహానికి సర్వులూ వేచి ఉన్నారు."

"ఈ వేళ మాకు తీరిక లేదని విన్నవించు. నా చెలికాడు కుచేలునితో మాకు అత్యంత ప్రధాన కార్యం ఉందని తెలియచేయి."

కుచేలుడి గుండె గుభేలు మంది.

"కృష్ణా! నేను వెళ్లి పడుకుంటాను. నీవు పోయి ఆ మహాతల్లికి సంతోషం కలిగించు. ఈ పాపం కూడా నా నెత్తిన రుద్దకు!"

కృష్ణుడు మరికాస్త రెచ్చిపోయి... "మా ఆనందం కంటే ఎవరి జన్మదినోత్సవమూ ఎక్కువ కాదు. మిత్రమాధుర్య కేళీ విలసితుడనై ఉండగా మమ్ము రమ్మని పిలిపించిన జాంబవతీ దేవికి మా తీవ్ర ఆక్షేపణ తెలియచేయి. ఇటువంటి అపరాధం మరొకసారి జరగకూడదని మా హెచ్చరికగా విన్నవించు."


"సెలవు స్వామీ! తమ ఆజ్ఞ" అంటూ పరిచారిక నిష్క్రమించింది.


కుచేలుడికి స్పృహ తప్పింది.

కృష్ణుడు - "కుచేలా! కుచేలా!" అంటూ తనను పట్టుకుంటున్నట్టు మాత్రం తెలిసింది. ఆనక గుర్తు లేదు. జారి క్రిందపడిపోయాడు.

తెలివి వచ్చేసరికి తన మనస్సును ఏదో మత్తు ఆవరించినట్టుంది. నిద్రలో సమస్త భయాందోళనలూ నిష్క్రమించినట్లనిపించింది. చుట్టూ ఆవులు ఆవుల దూడలు... మెడల్లో గంటల సవ్వడి. పాలు పితికే గోపాలురు. గోవుల మేసే పచ్చి గడ్డి వాసనలు. పాల బిందెల నుంచి వచ్చే మధువు వాసన. గోవుల మూత్రాలచే వయనించే ప్రకృతి గంధం.

హాయిగా ఉంది ప్రాణం. అమ్మయ్య ఇక్కడ దేవకాంతలు లేరు. భోగ విలాసాలు లేవు. కర్పూర గంధాలు లేవు. పట్టు శయ్యలు లేవు. గడ్డిపై కూర్చున్నా రిద్దరూ.





ఒక గోపాలుడు వచ్చి రెండు చెంబుల్తో పా లిచ్చి వెళ్లిపోయాడు. ఇద్దరూ హాయిగా తాగుతున్నారు. కుచేలుడి భయం పోయింది.

"ఏయ్ కృష్ణా! బాగుంది కదోయ్ ఈ గడ్డి. ఎంత మెత్తగా ఉందో! చూడు చూడు ఆ మిడత. ఇదిగో చూడు ఈ సీతాకోక చిలుక. ఆవు అరుస్తోం దెందుకు. కృష్ణా! పోయి గడ్డి వేసి వద్దామా. అబ్బ ఈ ఆవు నొప్పులు పడుతుందోయ్! రేవటికి బుల్లి బుజ్జాయి పుడుతుంది కాబోలు. నీకు పెయ్యి దూడ ఇష్టమా... గిత్త దూడ ఇష్టమా?"

"నాకు పెయ్యిలే ఇష్టమని నీకు తెలియదూ? ఉత్త మతిమరుపు మనిషివి." కృష్ణుడు.

"ఆ పోద్దూ... నీకు మతిమరుపు లేదా? నిన్ను మీ అమ్మ యశోద ఎన్నిసార్లు కొట్టలేదూ? చెప్పిన మాట మరిచిపోయావని కదూ. అస్సలు మీ అమ్మ గారాబం వల్ల చెడిపోయావోయ్. ఆడపిల్లల్తో ఆ సరసా లేమిటి? వయో తారతమ్యం లేకుండా ఆ ఆట లేమిటి! అల్ల రేమిటి?"

కృష్ణుడి మనస్సు హాయిగా ఉంది.

"తిట్టు తిట్టు ఇంకా తిట్టు. ఎన్నాళ్లయిందో తిట్లు తిని!"

"తిట్టనూ?. నిన్నసలు గోడ కుర్చీ వేయించాలని ఉంది. గుంజీలు తీయించాలని ఉంది. ఎండలో నిలబెట్టాలని ఉంది. ఈ మాయ లేమిటి.. ఈ మర్మా లేమిటి! అంత మంది స్త్రీలతో విలాసా లేమిటి? రాచ కార్యాలు మాని ఈ కేళీ వినోదా లేమిటి?"

"నీవూ చేయటం లేదూ అల్లరి? పూజలనీ పునస్కారాలనీ ఎప్పుడూ ఒకటే గొడవ తప్ప. నీ భార్య సంతోషా లాలోచించవా? నీ బిడ్డల సౌఖ్యాన్ని కోరుకున్నావా? నీకు ముక్తి.. రక్తి అంతా నీ భక్తే నన్నమాట! ఉండు నీ భార్యకు కబురు చేస్తాను. ఈ ముసలి వాణ్ణి వదిలి ఎటన్నా వెళ్లిపో అమ్మా అని."

"పోతే పోనీ. హితులూ సుతులూ పోనీ.. నీతో ఆడుకుంటుంటే చాలు. నీతో మాట్లాడుకుంటుంటే చాలు. నీతో పోట్లాట చాలు. వెధవ జీవితాలు వద్దు. భవబంధాలూ వద్దు. ఏదీ ఇద్దరం ఈ వెన్నెల్లో కోతి కొమ్మచ్చి ఆడుకుందామా?"

"పిల్లల మేమిటి ఇంకా ఆడుకోవటానికి? నా భార్యలు చూస్తే చీవాట్లు పెడతారు. అవతల జాంబవతి ఇంట్లో కార్యానికి కూడా రాకుండా కోతికొమ్మచ్చులా అని."

"అబ్బ ఎప్పుడూ ఉండే భార్యలే గద కృష్ణా! జన్మదినోత్సవాలు రావా ఏమిటి! హాయిగా ఆడుకుందాం పట్టు. పోనీ ఓ గిత్త దూడను వదులుదాం. దాని వెంటే పరుగెత్తి పట్టుకుందామా?"

"సరి సరి. గోపాలురు అంతా మేలుకునే ఉన్నారు. మహారాజు గారు ఇదేవిటా అని విస్తుపోరూ. నా పరువు మిగల్చవా?"

"పోనీవోయ్ వెధవ పరువూ... ప్రతిష్ఠా! ప్రభువులూ.. సేవకులూ.. అంతా మాయ. కృష్ణా! రా! ఇలా నా దగ్గర కూర్చో. కాళ్లు ఈ నీళ్లలో పెట్టి తపతపా కొట్టు. చందమామ వంక చూస్తూ ఓ సారి వేణువు వినిపించు. ఏదీ నీ వేణు వేదీ. ఇంట్లోనే మరిచిపోయా వేమిటి?"

"లేదు. ఇక్కడే ఉంది."

"అయితే ఊదు. పిల్ల గాడే అల్లరి గొల్లవాడే. చల్లని వెన్నెల్లో కొలువు తీర్చినాడే. కులుకు నేర్చినాడే.. ఆడపిల్లల బట్టలన్నీ కొల్లగొట్టినాడే.. చేతబట్టినాడే.. ఆ పాటకు వాయించు."

వేణునాదం ప్రారంభమయింది.

"అబ్బ అదిగో స్వరం తప్పుతూంది. మనస్సిక్కడ లేనట్లుంది. జాగ్రత్తగా వాయించు."

"ఆ.. అదీ.. అదీ.. ఆహా.. ఆహా... ఏం గతి... ఏం రాగం... ఏమి స్వరమాధుర్యం.. అదిగో మళ్లీ ఏం గుర్తొచ్చింది. భార్యలు గుర్తొచ్చారా. బుద్ధి పోనిచ్చుకున్నావు గాదు. కబుర్లే గాని ఎప్పుడూ మనస్సు ఆ సత్యభామ దగ్గరేనా... వేణువు వాయించు. ఇంకాస్త స్వరం పెంచు. కాస్త... అదీ.. అదీ..." కుచేలుడు మధ్యలో ఆగి.

"అదేమిటీ... ఎవ రా వచ్చేది? కృష్ణా... కృష్ణా... కొంప మునిగింది! నీ భార్యామణులు సపరివారంగా తరలి వస్తున్నారు. కాసేపు ప్రాణానికి హాయి నివ్వరు గదా. నిన్ను ఒక్క క్షణం విశ్రాంతిగా వదలరు గదా! ఏదో పాత

స్నేహితులం ఒక్క రాత్రి కబుర్లాడుతుంటే కొంప మునిగినట్లు వస్తున్నారు. వచ్చేశారు. నిన్ను ఎత్తుకుపోతారు కాబోలు."

కృష్ణుడు వేణువు నాపి చిరు నవ్వులు చిందిస్తున్నాడు.

"ఏం తల్లులారా! పడిపోయినట్లు వేం చేశారు? రేపు ఉదయం నుంచి మీ వారిని మీ కప్పగిస్తాం కదా. మనిషైనాక స్నేహితులూ, చుట్టాలూ రారా? ఒక్క క్షణం వదలరేం. ఇక్కడకు కూడా దయచేశారు. మా ఏకాంతం మీకు ఇష్టం లేదా?"

"క్షమించండి మహానుభావా! మీ ఏకాంతాన్ని హరించటానికి రాలేదు. మాకు తెలిసి ఎన్నడూ కృష్ణదేవులు ఇలా వేణువు వాయించలేదు. ఇంత మనోహర రాగానికి యావత్తు నగరమూ పారవశ్యంలో ఉంది. ఒక్కసారి మీ చెంత కూర్చుని మేం కూడా విందామని వచ్చాం. మా నృత్య కేళీ పద విన్యాసాలుగాని, మా సౌందర్యాలు గాని, నరాగాలు గాని స్వామిని ఇలా పాడించలేకపోయాయి. ఇంతటి భువన మోహన రాగాన్ని దగ్గరగా విందామని మాత్రమే వచ్చాం. అపరాధానికి క్షంతవ్యులం. స్వామి ఆపివేశాడు కూడా. మేం వెళుతున్నాం. కనీసం మీరైనా మళ్లీ వేణువు పట్టుకోమనండి. ఒక్కసారి మీరు వెళ్లిపోతే మళ్లీ పాడరని స్థిరంగా విశ్వసిస్తున్నాం. దయచేసి మరొక్క సారి."

"కృష్ణా.. కృష్ణా... ఇంకొక్కసారి ఆలపించు స్వామీ!"

కృష్ణుడు మెదల్లేదు. చేయి కదపలేదు.

"ఇదిగో నిన్నే.. నిన్నే అంటుంటే? ఏమిటోయి నీ బిర్ర బిగువు... పాడూ.. పాడతావా లేదా?" చేతితో కొట్టి అదిలించాడు!

వేణుగానం ప్రారంభమైంది. వెళుతున్నట్లు వెళ్లి ఆ పక్కనే పొదల చాటున కూర్చున్నారు కృష్ణ సతీమణులు. కృష్ణ హృదయం ఎందు కలా పరవశించిందో జ్ఞానోదయ మయింది.

ఈతను పేద బ్రాహ్మణు డేవిటి? సాక్షాత్తూ పరమేశ్వరుడు. అందుకే ఈయ నిలా విజృంభించటం. ఆ మాత్రం గ్రహించలే మేమిటే అంతా అనుకున్నారు.

ఒక్క రుక్మిణీ దేవి మాత్రం - "లేదు. ఈ రాత్రికి ప్రాధాన్య ముంది. కుచేల హృదయ మాధుర్యం చవిచూచిన తన్మయత్వం. అందుకే ఇక్కడ ఈ గోశాలకు తీసుకు వచ్చా రాయన. ఆయన చిన్ననాడు వదులుకున్న ప్రేమ భాండం మళ్లీ కదిలింది. ప్రేమకు లింగ, స్థాన, స్థాయీ స్వభావం లేదు. మనం కదిలించలేని ఆ భాండాన్ని ఆ విప్రోత్తముడు కదిలించాడు. స్నేహానికి పరమేశ్వర స్వభావం అక్కర్లేదు. ప్రణయ స్వభావం చాలును. అతనే ఆ ప్రణయమూర్తి" అని వివరించింది. కాబో లనుకున్నారంతా. ఒక్క సత్యభామ దేవి మాత్రం కొంచెం బాధగా నిట్టూర్చింది.

వేణుగానంలో కుచేలుడు నిద్రపోయి తెలవారుతుండగా లేచి - "ఇక్క డున్నామేమిటి.. కృష్ణా? లే.. లే! అయ్యో - మహానుభావా! నా కోసం వచ్చి గడ్డిపై పవళించావా? ఈ దారుణం అంతఃపురానికి తెలిస్తే నన్ను ఉరితీస్తారు కాబోలు. కృష్ణా... కృష్ణా... లే.. లే.. నే వెళతాను బాబూ. ప్రయాణానికి ఓ బండి ఇప్పించు చాలు. లే.. నడువ్... తొందరగా..."

కుచేలుని రథం కదుల్తుండగా వెనక నిలబడ్డ కృష్ణుడూ, అతని భార్యా సహిత పరివారం చేతులూపుతూంది.

కుచేలుడు మాత్రం "అమ్మయ్య రాత్రి గడిచింది. భోగ భాగ్యా లొద్దు. ఏమొద్దు. ఇంటికి చేరితే చాలు" అనుకుంటున్నాడు.

సామాన్య మానవుడు!!

